క్లుప్తంగా

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



గుడివాడ టౌన్: ఇన్విటేషనల్ నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్–2024లో తమ విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించి పతకాలు సాధించినట్లు గౌతమ్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ప్రిన్సిపాల్ పి.లక్ష్మీప్రసాద్ ఆదివారం తెలిపారు. ఈ నెల 22వ తేదీన కాకినాడలో జరిగిన పోటీల్లో అండర్–14 బాలుర వ్యక్తిగత కటా విభాగంలో బి.అఖిల్ కార్తికేయ, అండర్–11 కటా విభాగంలో బి.జోగేంద్ర నరేష్ బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. ఇంతటి ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులను, కోచ్ ఎస్. వెంకటేశ్వరరావును ప్రిన్సిపాల్స్ ఎం.సత్యారామ్, జ్యోతి, ప్రశాంతి అభినందించారు.

ఘనంగా ధనుర్మాస పూజలు



పామర్రు: ధనుర్మాసం పురస్కరించుకుని పలు వైష్ణవ ఆలయాల్లో ఆదివారం గోదాదేవి రంగనాథ స్వామివార్లకు విశేష పూజలను చేశారు. స్థానిక విష్ణాలయంలో అభిషేకాలను నిర్వహించారు. తదుపరి తిరుప్పావై ప్రవచించి దానికి తెలుగు అర్థాన్ని భక్తులకు ఆలయ అర్చకులు భార్గవ తెలిపారు. భక్తులందరికీ స్వామివారి నీరాజన మంత్ర పుష్పాలు, తీర్థ ప్రసాదాల వితరణ చేశారు. మండలంలోని జమీదగ్గుమిల్లిలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ధనుర్మాసం పురస్కరించుకుని విశేష పూజలను చేశారు. ఆలయ అర్చకులు ఆర్ ప్రసాద్ ఆధ్వర్యంతో తిరుప్పావై ప్రవచించి అర్థాన్ని తెలియజేశారు.

కొండలమ్మకు మొక్కుల చెల్లింపు



గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధిలో భక్తుల సందడి అధికమైంది. ఆదివారం అధికసంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. పాల పొంగళ్లను పొంగించిన మహిళా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి దర్శనానికి క్యూలో భక్తులు బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ ఆకుల కొండలరావు ఏర్పాట్లు చేశారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి నూతన సంవత్సర క్యాలెండర్లను ఆలయ ఈఓ ఆకుల కొండలరావు ఆధ్వర్యంలో ఆదివారం గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ఆలయ పండితుడు శరశ్చంద్ర, టీడీపీ నాయకుడు లింగం చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న ఈ–కేవైసీ గడువు

ముదినేపల్లి రూరల్: సొసైటీల వివరాలు కంప్యూటరీకరణలో భాగంగా రైతులు ఈ–కేవైసీ చేసుకునేందుకు గడువు సోమవారంతో ముగియనుంది. జిల్లా వ్యాప్తంగా అన్ని సొసైటీలను కంప్యూటరీకరణ చేసే ప్రక్రియను కొన్ని నెలల క్రిందటే ప్రారంభించారు. సొసైటీల్లో సభ్యులైన రైతులు తమ వివరాలను ఆన్‌లైన్లో ఈ–కేవైసీ చేయించుకోవాల్సి ఉంది. దీనివల్ల పంట రుణాలపై వడ్డీ రాయితీతో పాటు ఇతర ప్రయోజనాలు పొందే అవకాశం ఉంటుంది. దీని గురించి సొసైటీ పరిధిలోని గ్రామాల్లో సరైన ప్రచారం చేయకపోవడంతో ఎక్కువమంది రైతులు ఈ–కేవైసీ చేయించుకోలేకపోయారు. అదేవిధంగా ఇతర ప్రాంతాల్లో నివసిస్తూ సొంత గ్రామాల్లో భూములున్న రైతులు సొసైటీల్లో రుణాలు పొందారు. వీరు కూడా ఈ–కేవైసీ చేయించుకోవాల్సి ఉంది. సభ్యులైన రైతులు స్థానిక సచివాలయాల్లో ఈ–కేవైసీ చేయించుకోవాలని సొసైటీ కార్యదర్శులు తెలిపారు.

పెద్దింట్లమ్మకు రూ.41 వేల ఆదాయం

కైకలూరు: మండలంలోని కొల్లేటికోట శ్రీపెద్దింట్లమ్మవారికి ఆదివారం రూ.41,747 ఆదాయం వచ్చినట్లు కార్యనిర్వహణాధికారి కె.శ్రీనివాస్ తెలిపారు. ప్రత్యేక దర్శనం, అంతరాలయ దర్శనం, లడ్డూల విక్రయం ద్వారా ఈ ఆదాయం లభించినట్లు పేర్కొన్నారు.

బాక్స్ క్రికెట్.. యువతలో యమ క్రేజ్



ప్రస్తుతం క్రికెట్‌కు ఉన్న ఆదరణ మరొక ఆటకు లేదంటే అతిశయోక్తి కాదు.. పిల్లలు, పెద్దలు, మహిళలు అనే తేడా లేకుండా మన దేశ క్రికెట్ క్రీడాకారులు ఇతర దేశాల వారితో ఆడుతున్నప్పుడు టీవీలకు అతుక్కుపోతుంటారు. అదేవిధంగా ఫైనల్ మ్యాచ్‌లో ఇండియా, పాకిస్తాన్ ఆడుతుంటే నరాలు తెగే ఉత్కంఠతో తిలకిస్తుంటారు. అలాంటిది క్రికెట్‌కు ఉన్న క్రేజ్.. ఈ నేపథ్యంలో కైకలూరులో బాక్స్ క్రికెట్ కోర్టును ఏర్పాటు చేయడంతో ఆ కోర్టులో ఆడేందుకు ప్రతి ఒక్కరూ ఆసక్తి చూపుతున్నారు.

- గ్రామీణ ప్రాంతాలకు విస్తరిస్తున్న నెట్ క్రికెట్
- ఫ్లడ్‌లైట్లలో సాయంత్రం నుంచి ఆటవిడుపుగా క్రికెట్
- ముందే స్లాట్ బుక్ చేసుకుంటున్న క్రీడాకారులు



బాక్స్ క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

కైకలూరు: క్రికెట్ ఆట కనిపించని గ్రామమంటూ ఉండదు. ఇటీవల ప్రపంచ టీ–20 విజేతగా భారత్ నిలవడంతో క్రికెట్ ఆటపై యువత మరింత మక్కువ పెంచుకుంది. క్రీడామైదానాలు సరిపడా లేకపోవడంతో క్రికెట్ ఆడాలనే ఆసక్తి ఉన్నా ఆటకు యువత దూరమవుతున్నారు. ముఖ్యంగా ఉద్యోగులు, వ్యాపారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పనులతో అలసిపోతున్నారు. అటువంటి వారికి బాక్స్ క్రికెట్ క్రీడా తృష్ణను తీరుస్తోంది. విధుల నుంచి వచ్చిన తర్వాత గ్రూపుగా ఏర్పడి క్రికెట్ ఆడుతున్నారు. దీంతో ఆనందంతో పాటు చక్కటి వ్యాయామంగా బాక్స్ క్రికెట్ మారింది.

బాక్స్ క్రికెట్ పెద్ద ట్రెండ్

కేజ్ ఫిష్ కల్చర్ అంటే పారె నదులు, సముద్రాల్లో చుట్టూ వలలు కట్టి చేపలను సాగు చేసే పద్ధతి. ఈ పద్ధతికి మంచి క్రేజ్ ఏర్పడింది. అదే విధంగా క్రికెట్ క్రీడాకారులకు ఇప్పుడు బాక్స్ క్రికెట్ పెద్ద ట్రెండ్‌గా మారింది. ఇప్పటి వరకు పట్టణాలు, మెట్రో సిటీలకే పరిమితమైన బాక్స్ క్రికెట్ గ్రామీణ ప్రాంతాలకు విస్తరిస్తోంది. కైకలూరు–కలిదిండి రహదారిలో ఈ నెల 5న వారాహి బాక్స్ క్రికెట్ కోర్టును మురళీ, సుబ్రహ్మణ్యం రూ.15 లక్షలు వెచ్చించి ప్రారంభించారు. సాయంత్రం నుంచి రాత్రి 11 గంటల వరకు క్రికెట్ ఆటలు సాగుతున్నాయి.

స్లాట్ బుకింగ్ తప్పనిసరి

బాక్స్ క్రికెట్ ఆటకు ముందుగానే క్రీడాకారులు స్లాట్ బుక్ చేసుకోవాలి. మొత్తం 6 ఓవర్లు, ఆరుగురు చొప్పున 12 మంది క్రీడాకారులు గంట పాటు ఆట ఆడినందుకు రూ.600 చెల్లించాలి. శని, ఆదివారాలు వీకెండ్ సందర్భంగా గంటకు రూ.700 తీసుకుంటారు. పట్టణాల్లో గంటకు రూ.1,500 సైతం వసూలు చేస్తున్నారు. క్రికెట్ కోర్టు 50 అడుగులు వెడల్పు, 90 అడుగుల పొడవు, 25 అడుగుల ఎత్తులో ఐరన్ రాడ్లు, నెట్‌తో నిర్మించారు. క్రీడాకారులకు నిర్వాహకులు ఫైబర్ బ్యాట్, లైట్ టెన్నిస్ బాల్‌ను అందిస్తున్నారు. యువకులతో పాటు పెద్ద వయస్సు కలిగిన వారికి కూడా లైట్ టెన్నిస్ బాల్ శరీరానికి హాని చేయదు. కైకలూరు పట్టణానికి దూరంగా నిర్మానుష్య ప్రాంతంలో బాక్స్ క్రికెట్ ఏర్పాటు చేయడంతో ఆహ్లాదకర వాతావరణంలో క్రికెట్‌ను క్రీడాకారులు ఆస్వాదిస్తున్నారు.

క్రికెట్ క్రీడాకారులు తయారవుతారు



బాక్స్ క్రికెట్‌లో తరచూ మ్యాచ్ ఆడితే కొత్త మెలకువలు తెలుస్తాయి. వీకెండ్ సమయంలో క్రికెట్ ఆడటానికి సరైన క్రీడా మైదానాలు లేవు. ఇటువంటి పరిస్థితుల్లో బాక్స్ క్రికెట్ క్రీడా తృప్తిని మిగుల్చుతోంది. దీని వల్ల శారీరక వ్యాయామంతోపాటు ఆనందం కలుగుతోంది.

– ఎం.ప్రసాద్, సీనియర్ క్రికెట్ క్రీడాకారుడు, కైకలూరు

క్రికెట్‌తో చక్కటి ఆరోగ్యం



కైకలూరు ప్రాంతంలో మొదటిసారిగా బాక్స్ క్రికెట్‌ను పరిచయం చేశాం. పూర్వం హైదరాబాదు, విశాఖపట్నం వంటి ప్రాంతాలకు వెళ్లినప్పుడు బాక్స్ క్రికెట్ అందుబాటులో ఉండేది. నేడు భీమవరం, గుడివాడ, ఏలూరు వంటి ప్రాంతాల్లోనూ బాక్స్ క్రికెట్ అందుబాటులో వచ్చింది. క్రికెట్ ఆటతో పాటు చక్కటి ఆరోగ్యం దక్కుతుంది.

– ఎం.మురళీధర్, నిర్వాహకులు, కైకలూరు

చక్కటి వ్యాయమం

ఉద్యోగాలు, వ్యాపారాలు చేసే వారిలో అనేక మందికి క్రికెట్ అంటే ఇష్టం. గతంలో క్రికెట్ ఆడే సమయం కుదరని వారికి బాక్స్ క్రికెట్ ఆనందాన్నిస్తోంది. పాత స్నేహితులు 12 మంది కలిసి స్లాట్‌ను బుక్ చేసుకుంటున్నారు. రాత్రి సమయంలో గంట పాటు క్రికెట్ ఆడుతున్నారు. రోజంతా విశ్రాంతి లేకుండా పనులు చేసి ఈ విధంగా క్రికెట్ ద్వారా ఆనందం పొందుతున్నామని పలువురు చెబుతున్నారు. రానున్న రోజుల్లో బాక్స్ క్రికెట్ కల్చర్ మరింతగా పెరగనుంది.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. దూర ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని పుట్టలో పాలు పోసి స్వామిని దర్శించుకున్నారు. పాల పొంగళ్లశాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారుచేసి స్వామికి సమర్పించారు. నాగబంధాల వద్ద, గోకులంలోని గోవులకు మహిళలు పూజలు చేశారు. ఆలయ సహాయ కమిషనర్ గంగాశ్రీదేవి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

పమిడిముక్కల: జూదం ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం మేరకు మండల పరిధిలోని మంటాడ గ్రామ శివారుల్లో జూద శిబిరం నిర్వహిస్తున్నారంటూ వచ్చిన సమాచారం మేరకు పమిడిముక్కల ఎస్‌ఐ శ్రీను తమ సిబ్బంది దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.11,700 స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. దీనిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచనున్నట్లు పేర్కొన్నారు.

బీజేపీ అధ్యక్షుడిగా దుర్గాప్రసాద్

కైకలూరు: బీజేపీ కలిదిండి మండల శాఖ అధ్యక్షుడిగా అంకాల దుర్గాప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కలిదిండిలో ఆదివారం నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది.

బీజేపీ మండల అధ్యక్షురాలిగా నాగలక్ష్మి

ముదినేపల్లి రూరల్: బీజేపీ మండల శాఖ అధ్యక్షురాలిగా సత్యవోలు నాగలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బీజేపీ రిటర్నింగ్ అధికారి ఎస్.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమెను సభ్యులంతా ఏకగ్రీవంగా ప్రతిపాదించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణ, ఒత్తిమిల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సినీ ఫక్కీలో ఘరానా మోసం

గుడ్లవల్లేరు: మండలంలోని కూరాడలో పట్టపగలే దొంగలు సినీ ఫక్కీలో ఘరానా మోసం చేశారు. ఓ దుకాణ యజమానికి టోకరా కొట్టి దౌర్జన్యంగా రూ.10వేలను చోరీ చేసి పరారైన సంఘటన కూరాడలో శనివారం చోటు చేసుకుంది. భవానీ మాల ధారుల వేషధారణలో నలుగురు గుర్తు తెలియని యువకులు గ్రామంలోని ఒక బడ్డీ కొట్టుకు వచ్చారు. దీక్షలో ఉన్న తమ మాలధారులకు చందా ఇవ్వాలంటూ ఆ యజమానిని కోరారు. తమకు రూ.100 చందా కావాలని డిమాండ్ చేశారు. ఫోన్లో మాట్లాడుతున్న యజమాని ఆ మాలధారులను పెద్దగా పట్టించుకోకుండా లైట్ తీసుకున్నాడు. తీరా ఆ మాలధారుల్లో ఒకరికి అమ్మవారు తన మీదకు వచ్చి పూనకం వచ్చినట్లుగా క్రియేట్ చేసి నటించారు. వెంటనే దుకాణ యజమాని తన వద్దనున్న రూ.10వేల కట్టలో రూ.100ను తీసి మాలధారులకు చందాగా ఇచ్చేశాడు. ఆ మాలధారుల్లో ఒకరు మిగిలిన ఆ రూ.10 వేల కట్టను రెప్పపాటులో దుకాణ యజమాని నుంచి లాక్కొని బైక్‌పై ఉడాయించాడు. మిగిలిన మాలధారులు కూడా బైకులపై పారిపోయారు. ఆ దుకాణ యజమాని తన స్నేహితులతో కలిసి ఆ దొంగలను కైకలూరు వరకు వెంబడించినా ఫలితం దక్కలేదు. కైకలూరు, ముదినేపల్లి, గుడ్లవల్లేరు పోలీసులకు తన గోడును ఆ బాధితుడు చెప్పుకున్నాడు. ఈ దొంగలు ఆకివీడుకు చెందిన గుంపు బ్యాచ్ అని పోలీసుల నుంచి సమాచారం. వీరి కోసం కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ విషయంపై తమకు సమాచారం లేదని గుడ్లవల్లేరు ఎస్‌ఐ ఎన్.వి.వి.సత్యనారాయణ ఆదివారం తెలిపారు.

విలువలతో కూడిన విద్యతో ఉన్నత స్థానాలు



విజేత జట్టుకు జ్ఞాపిక అందజేస్తున్న అతిథులు

గన్నవరంరూరల్: విలువలతో కూడిన విద్య విద్యార్థులను ఉన్నత స్థానాలకు చేర్చుతుందని ప్రముఖ దంత వైద్య నిపుణుడు డాక్టర్ కొడాలి జె.రమేష్ పేర్కొన్నారు. శనివారం రాత్రి మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఎంతో గొప్ప విలువలు కలిగిన విద్యాసంస్థలో చదువుకున్న మీరందరూ ప్రపంచంలోని నలుమూలల సేవలందించి దేశానికి, చదువుకున్న విద్యా సంస్థకు, తల్లిదండ్రులకు, అధ్యాపకులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

విద్యార్థుల జీవితాల్లో వెలుగులు

అకాడమీ కోశాధికారి సూరెడ్డి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 50 ఏళ్ల క్రితం నిస్వార్థంతో ప్రారంభమైన అకాడమీ నేడు అంచెలంచెలుగా ఎదిగి వేల మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు. సిద్ధార్థ అకాడమీ ఎన్నో దశాబ్దాలుగా విద్యా రంగంలో నాణ్యమైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఖర్చుకు వెనుకాడకుండా విద్యార్థులకు ఉన్నత భవిష్యత్తే లక్ష్యంగా విద్యను అందిస్తోందని చెప్పారు. అందుకు అకాడమీ అందజేస్తున్న సహకారం ఎనలేనిదని కొనియాడారు. విద్యాసంస్థలో తమ బిడ్డలను చదివించిన తల్లిదండ్రులను అభినందించారు. ఇక్కడ చదవడం అదృష్టమని, అది మీ అందరి పూర్వజన్మ సుకృతంగా పేర్కొన్నారు. కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎంవీ రామోజీరావు, కన్వీనర్ వి.నాగసాయి, మధుసూదన్ రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి



ఐద్వా ఆధ్వర్యంలో తాడిగడపలో నిరసన

పెనమలూరు: మచిలీపట్నంలో బాలికపై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఐద్వా ఆధ్వర్యంలో ఆదివారం తాడిగడప కార్మికనగర్‌లో నిరసన ప్రదర్శన చేపట్టారు. మండల ఐద్వా కార్యదర్శి పుసునూరు పాతాళలక్ష్మి మాట్లాడుతూ మచిలీపట్నంలో ఎనిమిదేళ్ల బాలికను నలుగురు యువకులు అత్యాచారం చేయటం దారుణమన్నారు. ఎన్ని చట్టాలు ఉన్నా తల్లిదండ్రులు ఆడ పిల్లలను పాఠశాల, కాలేజీలకు పంపాలంటే ఆందోళన చెందుతున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలపై అత్యాచారాలు నానాటికి పెరిగిపోతున్నాయన్నారు. నిందితులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోకపోవటంతోనే ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు. నేతలు లావణ్య, ఉప్పాడ త్రిమూర్తి, సీహెచ్.భవాని, ఈశ్వరి, గంగా, రోజామణి, ఎం.వరలక్ష్మి, రోజా, రమణమ్మ, లక్ష్మినారాయణ, రాంబాబు పాల్గొన్నారు.

ఘనంగా మాదిగ దినోత్సవం



బాబూ జగజ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గుడివాడ టౌన్: స్థానిక గుడ్‌మెన్ పేటలో ప్రపంచ మాదిగ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మాదిగ జాతి ఔన్నత్యం, చరిత్ర ఆధారాలు, సంస్కృతి, ఆచార వ్యవహారాలు, అనుబంధ కులాల ఆచార వ్యవహారాలు, వారి సమస్యలు తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కంచర్ల సుధాకర్, మామిళ్ల ఎలీషా, వెంపటి సైమన్, వేల్పుల నాగబాబు, గంధం సైమన్‌బాబు, ఎ.మాణిక్యాలరావు, కొడాలి బాబు, పసలాది శేఖర్, అద్దంకి కమల, జె. ప్రశాంతి పాల్గొన్నారు.

కొర్లపాడులో నగర సంకీర్తన



మండవల్లి: ధనుర్మాసం సందర్భంగా మండవల్లిలో కొలువై ఉన్న శ్రీ దత్త పరంపర సహిత షిర్డీ సాయిబాబా మందిరం ఆధ్వర్యంలో ఆదివారం కొర్లపాడులో నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు వెళ్లి భిక్ష స్వీకరించారు. గుడివాడ చిట్టిబాబు, బందారు వెంకయ్య, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

పెయింటింగ్‌లో నవ్యశ్రీ ప్రతిభ



ముదినేపల్లి రూరల్: కేంద్ర యువజన క్రీడల శాఖ మంత్రిత్వ శాఖకు చెందిన నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పెయింటింగ్ పోటీల్లో మండలంలోని గురజకు చెందిన ఎం.నవ్యశ్రీ ప్రథమ బహుమతి సాధించింది. ఈ నెల 27న ఏలూరులో నిర్వహించిన పోటీల్లో వికాస్ కళాశాల్లో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్న నవ్యశ్రీ ప్రతిభ కనబరిచింది. విద్యార్థినికి అధికారులు నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

షటిల్ పోటీల విజేతలకు బహుమతులు



గుడివాడ టౌన్: ఏజీకే షటిల్ కోర్టు 8వ వార్షికోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన షటిల్ టోర్నమెంట్ విజేతలకు ఆదివారం బహుమతులు అందజేశారు. కృష్ణాజిల్లా డీసీబీ సెక్రటరీ షేక్ జానీ సాహెబ్ ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ టోర్నమెంట్‌లో సతీష్ కేసీఆర్ టీమ్, జోసఫ్ భూన్ టీమ్‌పై విజయం సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. యూటీఎఫ్ జిల్లా సహ అధ్యక్షుడు నీలం ప్రభాకరరావు, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు, ఏజీకే షటిల్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక పారితోషకాలు



ప్రోత్సాహకాలు పొందిన విద్యార్థులతో సేవా సంస్థ సభ్యులు

గుడివాడ టౌన్: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఐదుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 5 వేలు చొప్పున మొత్తం రూ. 25 వేలు విద్యాప్రోత్సాహక పారితోషకాలు అందజేసినట్లు సంస్థ జిల్లా అధ్యక్షురాలు దండమూడి జయలక్ష్మి తెలిపారు. సేవా సంస్థ కార్యాలయంలో ఆదివారం ఈ వితరణ అందజేశామన్నారు. అట్లూరి సత్యనారాయణ–భాస్కరమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఈ వితరణ ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ పీవీ శేషగిరిరావు, అధ్యక్షుడు గుత్తా రమేష్, మున్సిపల్ మాజీ చైర్మన్ లంకదాసరి ప్రసాదరావు, గుడివాడ శాఖ అధ్యక్షుడు వేణుగోపాల్ పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడి మృతదేహం మెడికల్ కళాశాలకు



శేషగిరిరావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న చైర్మన్ శశికళ

గుడ్లవల్లేరు: అంగలూరుకు చెందిన త్రిపురనేని శేషగిరిరావు(87) అనే విశ్రాంతి ఉపాధ్యాయుడు మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో చిన అవుటపల్లి పిన్నమనేని సిద్దార్థ మెడికల్ కళాశాలకు మృతుడి కుమారుడు సుధాకర్ దానం చేశారు. వైద్య పరిశోధనల నిమిత్తం ఈ దేహాన్ని వినియోగిస్తారని ఆ కాలేజీ యాజమాన్యం తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ, లయన్స్ జిల్లా మాజీ చైర్మన్ వై.పి.సి.ప్రసాద్, మాజీ సర్పంచి చాపరాల బాలాజీ, లయన్స్ ప్రతినిధులు పరంధామయ్య, రామకృష్ణ, చిట్టిబాబు పాల్గొన్నారు.

ప్రాణశక్తిని కాపాడుకోవాలి



పెనమలూరు: ప్రాణశక్తిని కాపాడుకుంటేనే జీవించగలుగుతామని యోగా శక్తి సాధన సమితి వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ మాకాల సత్యనారాయణ పేర్కొన్నారు. ఆయన ఆదివారం కానూరులో వివరాలు తెలుపుతూ కానూరు అశోక్‌నగర్ తన కార్యాలయంలో జనవరి 4వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ప్రాణశక్తి పెంపు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ప్రాణశక్తి మనుషుల్లో పుష్కలంగా ఉండేదన్నారు. ఇప్పుడు ప్రాణశక్తి తగ్గి మనిషి ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో 60 శాతం ప్రాణశక్తి ఉన్నవారు ఎక్కువగా ఉండే వారని ఇప్పుడు అటువంటి వారు కనబడటం లేదన్నారు. ప్రాణశక్తి కనీసం మూడు శాతం ఉంటేనే మనిషిలో కదలిక ఉంటుందని చెప్పారు. 10 శాతం ఉంటేనే నడవగలుగుతారని, 30 శాతం ఉంటూ 10 కిలోమీటర్లు నడవగలుగుతారన్నారు. ఇప్పుడు 40 శాతం మించి ప్రాణశక్తి ఉన్న వారు కనబడటం లేదన్నారు. తాము నిర్వహించే ప్రాణశక్తి శిక్షణ తరగతుల్లో పాల్గొని పూర్తి అవగాహన పొందాలన్నారు. మరిన్ని వివరాలకు 90003 47369 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు



ఉయ్యూరు: రోటరీ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో చెస్ పోటీలు ఆదివారం ఉత్సాహంగా సాగాయి. పట్టణంలోని రోటరీ ఆడిటోరియంలో నిర్వహించిన పోటీలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొని ప్రతిభ చాటారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి మేధోశక్తిని పెంపొందించేందుకు చెస్ పోటీలు నిర్వహించామని రోటరీ క్లబ్ అధ్యక్షుడు చొప్పరపు నాగ సుబ్రహ్మణ్యం తెలిపారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీలకు న్యాయనిర్ణేతగా చదరంగం రాష్ట్ర స్థాయి క్రీడాకారిణి కీర్తి వ్యవహరించారు. రోటరీ ప్రతినిధులు సయ్యద్ అనిస్, సీకే వసంతరావు, వెంకటేశ్వరరావు, అమీర్ మీర్జా, బొమ్మారెడ్డి సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా శిక్షణ పూర్తి చేసిన వారితో నిర్వాహకులు

పెనమలూరు: యోగా చేయటంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా జీవించగలుగుతామని శ్రీ వెంకటేశ్వర యోగా కేంద్రం ఉప ప్రధాన యోగాచార్యులు మంద్రు శ్రీనివాసరావు అన్నారు. పెనమలూరు సెంటర్ కిలారు అనిల్ ఎస్టేట్‌లో ఆదివారం 64వ బ్యాచ్ ఉచిత యోగా శిక్షణ ముగించిన, అలాగే 65వ బ్యాచ్ ప్రారంభ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. యోగా చేయటంతో అనేక రుగ్మతలకు దూరంగా ఉండగలుగుతామన్నారు. యోగా చేసిన వారు ఎందరో ఉన్నత స్థానాలకు ఎదిగి మహానుభావులు అయ్యారని తెలిపారు. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా యోగాను అభ్యసించాలని సూచించారు. శ్రీవెంకటేశ్వర యోగా గురువు సందేశాన్ని వినిపించారు. ఈ సందర్భంగా యోగా శిక్షణ ముగించిన వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. పలువురు యోగా గురువులను సత్కరించారు. కార్యక్రమంలో యోగా గురువులు నేరెళ్ల తులసీకృష్ణ, కొక్కిలిగడ్డ వెంకటకృష్ణ, పాల్గొన్నారు. యోగా శిక్షణ తరగతుల్లో చేరేవారు 91333 06804 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.